సోమవారం 1 మే 2017

# ₹ 50 లక్షలు.. ఏడు రహదారులు

## కౌతవరంలో నిర్మాణం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే**

**మం**డలంలోని మేజర్ పంచాయతీల్లో రెండోదైన కౌతవరంలో ఒకేసారి ₹ 50 లక్షలతో ఏడు ప్రధాన రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రముఖ సినీనటుడు కైకాల సత్యనారాయణ కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆయా రహదారులను జీఎస్బీతో పరిచి సిమెంట్ రోడ్లు వేసేందుకు వీలుగా సిద్ధం చేశారు. మేజర్ పంచాయతీ కావడంతో కౌతవరంలో అంతర్గత రహదారులు, కాలనీలు, ఎస్సీవాడలు అధికం. జడ్పీ, పంచాయతీ, ఉపాధి నిధులు ఎన్ని వస్తున్నా ఇంకా చాలా రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉంది. దీంతో స్థానిక తెదేపా నేతలు గ్రామానికి చెందిన సినీనటుడు కైకాల సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును కలసి తన గ్రామానికి నిధులు ఇవ్వాలని కోరడంతో సమ్మతించారు. ఒకేసారి పంచాయతీరాజ్‌శాఖ నుంచి నేరుగా ₹ 50 లక్షల నిధులు మంజూరు చేశారు. అందుకు సంబంధించి స్థానిక తెదేపా నేతలైన జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంచౌదరిలు గ్రామానికి నిధులు కావాల్సిన రోడ్ల వివరాలను నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరిల ద్వారా పంచాయతీరాజ్ శాఖకు పంపడంతో సాంకేతిక, పరిపాలనామోదం లభించింది. టెండర్లు జనవరిలోనే పూర్తయ్యాయి. అయితే తక్కువకు టెండర్లు వేసిన గుత్తేదారుడు పనులు చేసేందుకు ముందుకు రాకపోవడంతో నెలన్నర ఆలస్యమైంది. ఎట్టకేలకు పనులు చేపట్టి చేస్తున్నారు. రూ. 20 లక్షలతో పంచాయతీ కార్యాలయం పక్క నుంచి బంటుమిల్లి కాల్వకు వెళ్లే అన్ని కులాల, మతాలకు చెందిన శ్మశానాల రహదారిని, రూ. 5 లక్షలతో చిన ఎస్సీవాడలో, రూ. 4 లక్షలతో పెద ఎస్సీవాడలో, రూ. 5 లక్షలతో రామకోటి ఆలయం నుంచి గ్రంథాలయం వరకు, రూ. 5 లక్షలతో గాలిగోపురం ఎదురు రోడ్డుకు, రూ. 4 లక్షలతో కైకాల సొంత వీధికి, రూ. 3 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రం ఎదురురోడ్డును అభివృద్ధి చేశారు.




₹ 5 లక్షలతో అభివృద్ధి చేపట్టిన గ్రంథాలయం రహదారి, ₹ 20 లక్షలో శశ్మానాల రహదారి

# వరిగడ్డి వాముల దగ్ధం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరంలో పశువుల కోసం నిల్వ చేసిన వరిగడ్డి వామి దగ్ధమైంది. ఆదివారం రాత్రి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ఆరేపల్లి నాగేశ్వరరావుకు చెందిన 12 ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైంది. గుడివాడ అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. గడ్డి విలువ ₹ 60 వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు.

## పొంగుతోనే...పట్టుపట్టి...కౌతవరం తృతీయ స్థానం..


తల్లితండ్రులతో శ్రావణి

హోరాహోరీగా తోటి విద్యార్థులతో చదువులో పోటీ పడి 1 ,2 స్థానాలతో ప్రతిభ చూపిన ఆ విద్యార్థిని తుది పరీక్షల సమయంలో పొంగు వచ్చినా పట్టు విడవక తృతీయస్థానం సాధించింది. కౌతవరంలో హైస్కూల్ మార్గంలో రోడ్డు పక్కన చిన్న చెక్కబడ్డీలో కిరాణా దుకాణం నిర్వహించుకునే బెజవాడ శ్రీనివాసరావు-లీలావసంతల కుమార్తె శ్రావణి. నలుగురి పోషణకు ఆ చిన్న దుకాణమే ఆధారం. తమ కుటుంబ పరిస్థితి తెలిసి ఎక్కడా రాజీ పడకుండా చదువులో ముందుండేది శ్రావణి. ప్రతి పరీక్షలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోనే ఉండేది. తుది పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించాలని నిర్దేశించుకుంది. అయితే పరీక్షల సమయానికి పొంగు రావడంతో పెన్ను కూడా పట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. తండ్రి రోజూ వాహనంపై పరీక్ష కేంద్రం వద్ద దింపితే పట్టు విడవకుండా పరీక్షలు రాసింది. నేడు హైస్కూల్‌లో తృతీయ స్థానం సాధించింది. పాలిటెక్నిక్ చదివించి ఆ డిప్లొమాతో ఉద్యోగం సాధించేలా చూస్తామని, ఉన్నత చదువులు చదివించాలని ఉన్నా తమ ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించదని తండ్రి శ్రీను ఆవేదనగా వెల్లడించారు.

బుధవారం 3 మే 2017

## ₹ 2 కోట్లతో నియంత్రిక నిర్మాణ పనులు ప్రారంభం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** కౌతవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని బంటుమిల్లి కాల్వలో హెడ్‌రెగ్యులేటర్(నియంత్రిక) నిర్మాణం చేపట్టారు. శతాబ్దం కిందట బ్రిటీషర్లు నిర్మించిన ప్రధాన లాకులు శిథిలం కావడంతో డెల్టా ఆధునికీకరణ పథకం కింద ఈ నిర్మాణం చేపట్టారు. ₹ 2 కోట్ల


మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

వ్యయంతో ప్రధాన లాకులకు ముందు దీన్ని చేపట్టారు. ప్రస్తుతం బేస్‌మెంట్ నిర్మాణం కోసం పొక్లెయిన్‌తో కాల్వలో తవ్వకం చేస్తున్నారు. పనులను డీఈఈ కొడాలి బాబు పరిశీలించారు.

మంగళవారం 9 మే 2017

# విద్యా వల్లేరు

❖ ఏడింటికి ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నూరుశాతం ఫలితాలు

❖ మండలంలో ప్రథమం స్థానం కైవసం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే

**ప**దో తరగతి పరీక్ష ఫలితాల్లో గుడ్లవల్లేరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు సత్తాచాటాయి. ప్రైవేటు విద్యా సంస్థల కంటే మెరుగైన ఫలితాలతో రాణించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 10కి 10 జీపీఏలు సాధించింది వారే కావడం విశేషం. అలాగే ఈ ప్రభుత్వ హైస్కూల్స్‌లోనే 9జీపీఏ పైగా ఎక్కువ మంది సాధించారు. మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా వాటిలో ఆరు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి.

❖ వడ్లమన్నాడు ఉన్నత పాఠశాలలో 63 మందికి 63 మంది ఉత్తీర్ణులయ్యారు. పదికి పది జీపీఏను కాగిత తన్మయలక్ష్మి, బిల్‌ఖ్యాస్ బేగంలు సాధించి మండల ప్రథమ స్థానాలను సాధించారు. టి.అక్ష 9.7, కృష్ణలావణ్య 9.5 సాధించినట్లు హెచ్ఎం నాగేశ్వరరావు తెలిపారు

❖ కౌతవరంలో 97 మందికి 97 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో ద్వారక 9.7, హర్షవర్ధన్, గంగోత్రిలు 9.5, శ్రావణి 9 జీపీఏలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి వెల్లడించారు.

❖ విన్నకోటలో 43 మందికి 43 ఉత్తీర్ణులు కాగా, మహ్మద్ ఇక్రం 9.3 సాధించినట్లు హెచ్ఎం విష్ణుమూర్తి తెలిపారు.

❖ అంగలూరు బాలుర హైస్కూల్‌లో 29 మందికి 29 మంది ఉత్తీర్ణులు కాగా, వారిలో బొడ్డు కృపాసాగర్ 9.2, ప్రియానాథ్, నాగబాబులు 9 జీపీఏలు సాధించినట్లు హెచ్ఎం రాఘవేంద్రరావు వెల్లడించారు.



ద్వారక (కౌతవరం) బొర్రా జాహ్నవి (అంగలూరు) మహ్మద్ ఇక్రం (విన్నకోట)

❖ అంగలూరు బాలికల ఉన్నత పాఠశాలలో 58కి 58 మంది ఉత్తీర్ణులు కాగా, బొర్రా జాహ్నవి 9.3 జీపీఏ సాధించింది.

❖ డోకిపర్రులో 50కి 50 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో పి.మౌనిక 9.2 జీపీఏ సాధించింది.

❖ పెంజెంద్ర హైస్కూల్‌లో 15కు 13 మందికి ఉత్తీర్ణులయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం విశ్వమోహన్ తెలిపారు.

❖ గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్ (ఎయిడెడ్)లో 83కి 81 మంది ఉత్తీర్ణతతో 98 శాతం ఫలితాలు సాధించగా, వారిలో యు. క్యావశ్రీ 9.2 జీపీఏ సాధించినట్లు హెచ్ఎం రమణ వెల్లడించారు.

# చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరంలో పురాతన చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవాలను సోమవారం నుంచి ప్రారంభించారు. ఆలయ ఛైర్మన్ అబ్బినేని రాధిక ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు మూడు శతాబ్దాల నాటి చారిత్రక ప్రాశస్త్యం ఉన్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని పెండ్లికుమారుడిగా చేయడం, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన, వాస్తుహోమంలను అర్చకులు రొంపిచర్ల రవితేజ నిర్వహించారు.



పెండ్లికుమారుడిగా అలంకృతుడైన శ్రీచెన్నకేశవస్వామివార్లు

# పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణం



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కమలకుమారి, శంకర్‌నాథ్, కృష్ణలక్ష్మి

**కొత్తవరం(గుడ్లవల్లేరు):** డివిజన్‌లోని పాఠశాలల్లో ఇంకుడుగుంతలు తవ్వాలని గుడివాడ డీవైఈవో ఎం.కమలకుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాల-1లో, మండంలోని కొత్తవరం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఇంకుడుగుంతల తవ్వకాలను ఆమె పరిశీలించారు. ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి పాఠశాలలోనూ ఇంకుడు గుంతను నిర్మించాలని కోరారు. ఎంఈవో భవిరి శంకర్‌నాథ్, ప్రధానోపాధ్యాయులు చాపరాల కృష్ణలక్ష్మి, మోకా మాధవరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆకుల అరుణ, వార్డుసభ్యులు మత్తి నాగన్న పాల్గొన్నారు.

# ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వీరంకి గురుమూర్తి



హాజరైన ప్రజాప్రతినిధులు

**గుడివాడ, న్యూస్‌టుడే:** మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో దేశంలోని ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో నిలిచిందని పథకం డైరెక్టర్ వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంపై నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు అధికారులకు అవగాహన కలిగించే నిమిత్తం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం రూ.7వేల కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తానికి రూ.5893కోట్లు కలిపి రూ. 12,893 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గత ఏడాది 10వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం లక్ష్యం కాగా రాష్ట్రంలో 11వేల కిలోమీటర్లు మేర రహదారులను నిర్మించి అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని చెప్పారు. జలసంరక్షణకు 4లక్షల నీటి గుంతలు, మలమూత్ర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు 3లక్షల మరుగుదొడ్లు నిర్మించేందుకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఉందన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావుమాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేదల పాలిట వరమని, 100రోజులు పనిదినాలు కల్పించేదుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని చెప్పారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ మాట్లాడుతూ జలసంరక్షణలో భాగంగా నియోజకవర్గంలో అధిక మొత్తంలో నీటి గుంతలు నిర్మించేందుకు ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ వీరంకి గురుమూర్తిని ఘనంగా సత్కరించారు. క్షేత్ర సహాయకులకు ఎండనుంచి రక్షణ కల్పించే కిట్లను రావి వెంకటేశ్వరరావు, గుత్తా శివరామకృష్ణ పంపిణీ చేశారు. సమావేశానికి ఎంపీడీవో జ్యోతి అధ్యక్షత వహించగా ఉపాధి హామీ పథకం ఏపీడీ హేమంత్‌కుమారి, గుడ్లవల్లేరు ఎంపీపీ కొసరాజు విజయభారతి, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల ఎంపీడీవోలు, దొండపాడు ఎంపీటీసీ లింగంనేని స్రవంతి, చౌటపల్లి సర్పంచి చీకటి పుణ్యశ్రీ, శేరీ దింటకుర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు అడుసుమిల్లి లక్ష్మణరావు, తట్టివర్రు సర్పంచి కాకొల్లు రాజారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కారే జోసప్, రూరల్ మండలం, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల సర్పంచులు పాల్గొన్నారు.

## సజావుగా ఉపాధి కూలీ నగదు పంపిణీ

**కౌతవరం, వేమవరం(గుడ్లవల్లేరు):** ఉపాధి కూలీలకు ఎక్కడా వేతన బకాయిలు లేవని, ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందజేస్తున్నాయని ఉపాధి హామీ పథకం కేంద్ర మండలి రాష్ట్ర సభ్యులు వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆయన తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు, పీసీ ఛైర్మన్ గుత్తా చంటి, మండల తెదేపా అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరిలతోకలసి మండలంలోని కౌతవరం, వేమవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులతీరును పరిశీలించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు కొసరాజు వెంకటాద్రిచౌదరి, అడుసుమిల్లి రామ్మోహన్‌రావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం చౌదరి, నీటి సంఘాల అధ్యక్షులు కానూరి సత్యంబాబు, వడ్లమూడి దేశ్‌పతి, సర్పంచులు పడమట సుజాత, తాడంకి కుమారి, ఎఫ్‌ఏలు కృష్ణ, మండల జన్మభూమి కమిటీ సభ్యులు మన్నెం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం 12 మే 2017

# వైభవంగా వసంతోత్సవం



రథంలోని స్వామివార్లకు పూజలు

**వెణుతురుమిల్లి(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని వెణుతురుమిల్లిలో ఒకే ఆవరణలో ఉండే కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి, వసంతోత్సవం, స్థానిక చెరువులో చక్రస్నానాలు జరిపారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ కొప్పినేని పిచ్చేశ్వరరావు, సభ్యులు చందన సత్యనారాయణ, శివశంకరరావు, పమిడికొండల సురేశ్, పామర్తి వీరాంజనేయులు, పాగోలు వెంకటేశ్వరమ్మలు పర్యవేక్షించారు.

**విన్నకోట(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని విన్నకోట జనార్దనస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. విద్యుత్తు దీపాలు, పూలతో అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి గ్రామోత్సవం చేశారు. ఆలయ ఛైర్మన్ పేర్ని బాబూరావు, నీటిసంఘాధ్యక్షుడు కోటప్రోలు ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షుడు బెజవాడ కిశోర్, ఉపసర్పంచి పేర్ని శివప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరంలో పురాతన చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ అబ్బినేని రాధిక-శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో బిందెతీర్థం, నిత్యఅర్చన, బలిహరణ, కొట్నాలు, వసంతోత్సవం, పూర్ణాహుతి, రాత్రికి ధ్వజఅవరోహణ కార్యక్రమాన్ని అర్చకుడు రొంపిచర్ల రవితేజ నిర్వహించారు.

**గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే:** స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణం, రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, పల్లకీసేవ, ఊంజల్‌సేవ, పవళింపుసేవలను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఆదివారం 14 మే 2017

# వైభవంగా చెన్నకేశవుడి కల్యాణోత్సవాలు



ఆలయంలో మూలమూర్తులు

**కౌతవరం (గుడ్లవల్లేరు):** మండలంలోని కౌతవరంలో పురాతన శ్రీచెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ అబ్బినేని రాధిక-శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి అర్చకులు రొంపిచర్ల రవితేజ ఆధ్వర్యంలో భక్తులు, మహిళలు పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంతసేవలను నిర్వహించారు. దీంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగిశాయి.

# లక్షల వ్యయం..నీరు వినియోగించని వైనం

## పుల్లేరులో గుర్రపుడెక్క తొలగింపు తీరిది



పుల్లేరులో ఎగువ నుంచి కిందకు నెట్టి వేయటంతో రైల్వే వంతెన నుంచి లాకుల వరకూ మేట వేసిన గుర్రపు డెక్క

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పుల్లేరు...తూర్పుకృష్ణాలో అతిపెద్ద తాగు నీటి కాల్వ. అయిదు నియోజకవర్గాలకు సాగు, తాగునీరందించే ప్రధాన కాల్వ ఇది. ఇందులో గుర్రపుడెక్క మేట వేస్తే గుత్తేదార్లకు పండగే. గతేడాది జూన్ నుంచి నేటి వరకూ కౌతవరం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో (మామిడికోళ్ల నుంచి కౌతవరం లాకుల వరకూ 3 కి.మీ మేర) రూ. 2 లక్షల వ్యయంతో గుర్రపుడెక్కను తొలగింపు చేసినట్లు అధికారికంగా రికార్డులు చెబుతున్నాయి. ఎప్పటికప్పుడు నీలకంఠేశ్వరపురం వద్ద పుల్లేరు రైల్వే వంతెన వద్ద కూలీలు ఈ డెక్కను దిగువకు తోసేస్తే లాకుల వద్ద లస్కర్లు షట్టర్లు ఎత్తి మూడు కాల్వల్లోకి దిగువకు తోసేస్తారు. పక్షం రోజుల కిందట తాగునీటిని విడుదల చేయగా రైల్వేవంతెన ఎగువున దట్టంగా డెక్క పట్టేసి తాగునీరు కిందకు రావడం లేదని మళ్లీ పనులు చేపట్టారు. తూతూ మంత్రంగా కేవలం రైల్వేవంతెన వద్ద కూలీలను పెట్టి దిగువకు తోసి చేతులు దులుపుకొన్నారు. అక్కడ నుంచి డెక్క లాకుల వరకూ దట్టంగా మేటవేసింది. సాధారణంగా నీటి ప్రవాహం లేకున్నా లాకుల నుంచి ఎగువ నీలకంఠేశ్వరపురం వరకూ ఇటు వీళ్లు, అటు కౌతవరం 1వ వార్డు ప్రజలు ఈ నీటిని వేసవి అంతా వినియోగిస్తారు. వాడకకు, దుస్తులు ఉతికేందుకు వారికి ఇవే ఆధారం. నేడు డెక్కతో నిండిపోయి కుళ్లి నీరు దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం కాళ్లు కాల్వలో పెట్టేందుకు కూడా వీలు లేక దట్టంగా డెక్క ఉంది. దీంతో మహిళలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొద్ది రోజుల కిందట కాల్వల్లో పనుల నిమిత్తం వచ్చిన డీఈఈ కొడాలి బాబు, పీసీ ఛైర్మన్ గుత్తా చంటిల దృష్టికి ఈ విషయాన్ని కౌతవరం 1వ వార్డు మహిళలు తీసుకెళ్లారు. డెక్కను తొలగించి ఒడ్డున పడేయకుండా కిందకు నెట్టడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. వెంటనే డెక్కను తొలగిస్తామని వారు హామీ ఇచ్చారు. కానీ చర్యల్లేకపోవడంతో మహిళలు ఆవేదన చెందుతున్నారు.

మంగళవారం 16 మే 2017

# సమకూరిన అంగన్‌వాడీ భవనం



పూర్తయిన అంగన్‌వాడీ భవనం

**కొత్తవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కొత్తవరం ఒకటో వార్డులో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయ్యింది. ఏడు నెలల కిందట ₹ 7 లక్షల నిధులతో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. రెండు దశాబ్దాలుగా ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నేడు ఐసీడీఎస్, ఉపాధి నిధులు సంయుక్తంగా పంచాయతీ స్థలంలో దీన్ని 2016 అక్టోబరులో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భవనం పూర్తయింది. ఇందులో వరండా, హాల్, వంటగది, స్టోర్‌రూం, మరుగుదొడ్లను కలిపి నిర్మించారు. ఇంకా తలుపులు బిగించి రంగులు వేయాల్సి ఉందని పీఆర్ ఏఈఈ నాగేశ్వరరావు వెల్లడించారు.

# బంటుమిల్లి కాల్వ గట్ల అభివృద్ధి

## ₹ 30 లక్షలతో పూర్తయిన పనులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** ఎట్టకేలకు బంటుమిల్లి కాల్వ బాగు చేత పూర్తయ్యింది. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా ₹ 30 లక్షల వ్యయంతో దీన్ని నిర్వహించారు. గత రెండు నెలలుగా మూడు పొక్లెయిన్లతో చేపట్టిన పనులు పూర్తయ్యి కాల్వ బాగుపడింది. ఎనిమిదేళ్ల కిందట డెల్టా ఆధునికీకరణ పనులు ప్రారంభం కాగా గుత్తేదారుడు రెండు, మూడేళ్లకు ఒకసారి బంటుమిల్లి కాల్వ అభివృద్ధి పనుల కోసం జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం కొంత చేసి వదిలేయడం జరుగుతోంది. పూర్తిస్థాయిలో ఏనాడూ చేపట్టలేదు. ఎట్టకేలకు మార్చిలో పనులు ప్రారంభించారు. కౌతవరం ఇరిగేషన్ ప్రధాన లాకుల నుంచి కమలాపురం లాకులు(బంటుమిల్లి) వరకు కాల్వగట్ల పటిష్టీకరణ, అభివృద్ధి పనులు నిర్వహించారు. ₹ 30 లక్షల డెల్టా ఆధునికీకరణ నిధులతో కౌతవరం నుంచి కమలాపురం వరకు రెండువైపులా 10 కి.మీ. మేర మూడు పొక్లెయిన్లతో గట్లపై కంపచెట్లు నిర్వహిస్తూ గట్లపై మట్టిని పోసి ఎత్తుపల్లాలు సరి చేశారు. కాల్వలోకి చేరిన మట్టిని తొలగించారు. కొద్ది రోజుల కిందట జరిగిన నీటిసంఘాధ్యక్షుల సమావేశంలో ఆ ప్రాంత నీటిసంఘాధ్యక్షుడు కాల్వలోనే భారీగా మట్టిని తవ్వేసి గట్లపై పోశారు కానీ, కొత్తగా మట్టి కొనుగోలు చేసి తెచ్చి పోయలేదని ఆరోపించారు. దీనిపై గుత్తేదారుడు వీరమాచనేని ప్రసాద్ మాట్లాడుతూ అవన్నీ ఆరోపణ లేనని తాము చాలా చోట్ల కొత్త మట్టిని తెచ్చి పోసి గట్లను సరిచేశామని వివరించారు.



కౌతవరం వద్ద బంటుమిల్లి కాల్వలో పనులు చేస్తున్న పొక్లెయిన్లు

శుక్రవారం 19 మే 2017

# ఆలయంలో అన్నదానం

కౌతవరం(గుడ్లవల్లేరు): కౌతవరం శ్రీషిర్డి సాయి ఆలయంలో గురువారం అన్నదానం నిర్వహించారు. బాబాకు ప్రత్యేక అభిషేకాలు, హారతులతో పూజలు చేశారు. కౌతవరానికి చెందిన ఎన్నారైలు వేములపల్లి బాలకృష్ణ, రవళి దంపతులు, కూరాడకు చెందిన ఆకుల శివశంకర్, కనకదుర్గ దంపతుల వితరణతో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ మహిళా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# నీరు.. నీరు.. నీరు..

## పోటాపోటీగా ట్యాంకర్లు ఏర్పాటు చేసిన నాయకులు



కూరాడ లాకుదిగువున ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

**కూరాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని రెండు గ్రామాల్లో గురువారం మూడు వాటర్ ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు తాగు నీటిని అందించారు. తెదేపా, వైకాపా నాయకులు పోటీలు పడి మరీ నీటిని అందించడం విశేషం. కూరాడ నీటి పథకంకు చెందిన మోటార్ పాడైపోవడంతో పంచాయతీ నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో స్పందించిన మండల తెదేపా అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, వెంకటాద్రి చౌదరిలు తమ వాటర్ ట్యాంకర్‌కుతోడు తెదేపాకు చెందిన కుచికాయలపూడి సర్పంచి కొడాలి రామరాజు ట్యాంకర్ ద్వారా గురువారం తాగునీటిని అందిస్తున్నారు. స్థానిక తెదేపా నేతలు బొర్రా నాగేశ్వరరావు, కల్యాణపు నవాబు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే కొడాలి నాని కూడా తన ట్యాంకర్ ద్వారా కూరాడ ప్రజలకు నీటిని అందిస్తున్నారు. మహారెడ్డి మురళీ పర్యవేక్షిస్తున్నారు.

### కౌతవరంలో..

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కౌతవరంలో పంచాయతీ సరఫరా చేసే నీరు 1, 2, 34 వార్డుల ప్రజలకు అందక అల్లాడుతున్నారు. పక్కనే ఉండే పుల్లేరులోనూ నీరు లేక, ఉన్న నీటిపై డెక్క పట్టేయడంతో వాడుకకూ నీరు లేక అల్లాడుతున్నారు. పరిస్థితిని ప్రజలు మండల తెదేపా అధ్యక్షులు కొసరాజ బాపయ్యచౌదరి, వెంకటాద్రిచౌదరిల దృష్టికి తేవడంతో వారు గుడివాడ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుకు వివరించారు. దీంతో గురువారం యలవర్తికి చెందిన తాగునీటి వాటర్ ట్యాంకర్ కౌతవరం ఒకటో వార్డుకు చేరుకుని ప్రజలకు తాగునీటిని అందించడంతో అందరూ సంతోషించారు. స్థానిక తెదేపా నేతలు రెల్లు నగేశ్, అల్లు రాము, బొర్రా నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.



కౌతవరం ఒకటో వార్డులో..

సోమవారం 22 మే 2017

# కౌతవరంలో వరిగడ్డి వాము దగ్ధం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరంలో గ్రంథాలయం సమీపంలో బాడిగ నాగశేషుకు చెందిన ఐదెకరాల వరి గడ్డివాము దగ్ధమైంది. ₹ 25 వేల విలువైన నష్టం సంభవించినట్లు గుడివాడ అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్ వెల్లడించారు.

శుక్రవారం 26 మే 2017

# నీటి పథకం నిర్మించాలంటూ కౌతవరంలో మహిళల ధర్నా



ధర్నా చేస్తున్న మహిళలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** నీటి పథకం నిర్మించి తమ కష్టాలు తీర్చాలంటూ కౌతవరం మహిళలు గురువారం ధర్నా చేశారు. కౌతవరం 1, 2, 3, 4 వార్డులు కలిపి గ్రామానికి దూరంగా, గుడ్లవల్లేరుకు దగ్గరగా ఉంటుంది. ప్రధాన గ్రామం నుంచి వీరికి నీటి సరఫరా సక్రమంగా ఉండదు. పుల్లేరు కాల్వలోనూ నీరు లేక వారు వాడకకు, తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. 1వవార్డుకు చెందిన న్యాయవాది కాసాని మహాలక్ష్మి నేతృత్వంలో మహిళలు పెద్దసంఖ్యలో గురువారం ఉదయం ప్రధాన ఎంఎస్‌కే రహదారిపై ధర్నా చేశారు. తమ ప్రాంతానికి ప్రత్యేకంగా నీటి పథకం నిర్మించి తాగునీటిని సరఫరా చేయాలంటూ నినదించారు. ధర్నాతో వాహనాలు నిలిచిపోయాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చిస్తామని పోలీసులు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

# సైన్స్ ఎక్స్‌ప్రెస్ సందర్శనకు కౌతవరం విద్యార్థులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు గుడివాడలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం సందర్శించారు. హైస్కూల్‌కు చెందిన 1985-86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వారిని వాహనాల్లో గుడివాడ తీసుకెళ్లి అందులోని సైన్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏడాది కిందట పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్న ఆ బ్యాచ్ విద్యార్థులు హైస్కూల్ అభివృద్ధి కోసం నిధులు సేకరించారు. విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 9,10 తరగతులకు చెందిన విద్యార్థులు 60 మందిని మూడు వాహనాల్లో గుడివాడ తీసుకెళ్లి సైన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థుల సంఘ ఉపాధ్యక్షుడు ఎస్‌కే.అలీం, పింగళి భాను విశ్వనాథం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



హైస్కూల్ నుంచి బయలు దేరుతున్న విద్యార్థులు


HEALTH UNIT
సంఘమిత్ర స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్
1985-86
కాసాని దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, కవుతరం.


సంఘమిత్ర స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్
రి. నెం. 221/2016
1985-86 బ్యాచ్ స్నేహితుల సేవాసంస్థ వారి ఆధ్వర్యంలో
సైన్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎగ్జిబిషన్, గుడివాడ సందర్శన యాత్ర - ది. 25-5-2017.
శ్రీ కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, కపుతరం.



సంఘమిత్ర స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్
రి. నెం. 221/2016
1985-86 బ్యాచ్ స్నేహితుల సేవాసంస్థ వారి ఆధ్వర్యంలో
సైన్స్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎగ్జిబిషన్, గుడివాడ సందర్శన యాత్ర - ది. 25-5-2017.
శ్రీ కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్, కవుతరం.
DST 13
express
Climate Action Special
Kids Zone
PhotoGrid



ఆదివారం 28 మే 2017

# సక్రమ నీటి సరఫరాకు పంచాయతీలు చర్యలు తీసుకోవాలి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** గ్రామాల్లో సక్రమ నీటి సరఫరాకు పంచాయతీలు చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో ఆర్.విక్టర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని కౌతవరం ఒకటో వార్డులో నీటి ఎద్దడి, కొద్ది రోజుల కిందట తాగునీటి ట్యాంకు నిర్మాణంపై మహిళలు రాస్తారోకోలపై ఆయన పరిశీలన చేశారు. ప్రధాన గ్రామం నుంచి చివరన ఉండే తమకు నీటి సరఫరా సక్రమంగా లేదని, ట్యాప్‌లు బాగోలేవని మహిళలు, న్యాయవాది కాసాని మహాలక్ష్మిలు ఆయనకు వివరించారు. దీనిపై అధికారులు నాబార్డు ద్వారా ₹ 40 లక్షల అంచనాలతో నీటి పథకం నిర్మాణానికి అంచనాలు పంపారని సర్పంచి పడమట సుజాత ఆయనకు వివరించారు. దీనిపై తాను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకు పరిస్థితి వివరిస్తానని డీఎల్పీవో వారికి వెల్లడించారు.

సోమవారం 29 మే 2017

# కౌతవరం, వేమవరం, డోకిపర్రుల విజయం



గుడ్లవల్లేరు-కౌతవరం జట్ల మధ్య మ్యాచ్

**కూరాడ (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కూరాడ లాకు దిగువున దివంగత కల్యాణపు సాయిబాబు స్మారక మండల స్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం లీగ్ దశ పోటీలు కొనసాగాయి. గుడ్లవల్లేరు నీలకంఠేశ్వరపురంపై కౌతవరం 1వవార్డు జట్టు, కూరాడ బాలాజీనగర్‌పై వేమవరం జట్టు, బాలాజీనగర్ బుల్స్‌పై డోకిపర్రు జట్టు, కూరాడ లాకుదిగువ 11 బుల్లెట్స్‌పై ఆంజనేయ జట్టు విజయం సాధించాయి. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లు సాధించిన అజయ్‌కుమార్, ఫైజుల్, వెంకటేశ్వరరావు, దుర్గారావులకు దాత కల్యాణపు నవాబు బహుమతులు అందజేశారు.